సాక్షి నిజామాబాద్

ఆదివారం । 12 । మే । 2024



13 గుర్తింపు కార్డులు..
పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 13 రకాల గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ తెలిపారు.
- 2లో ▸




బూత్‌ల వద్ద ట్రాఫిక్ మళ్లింపు
లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు.
- 2లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 41.1 /27.3
ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇక పోలింగ్‌పై దృష్టి

- ముగిసిన ప్రచార పర్వం
- పోలింగ్ ఏజెంట్లను సిద్ధం చేసుకుంటున్న పార్టీలు
- విలక్షణ తీర్పులిచ్చే ఉమ్మడి జిల్లా ఓటర్ల నాడిపై ఉత్కంఠ
- మోదీ చరిష్మా విజయతీరాలకు చేరుస్తుందంటున్న బీజేపీ శ్రేణులు
- గెలుపుపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో గట్టి ధీమా
- ప్రాబల్యం నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రచార పర్వం శనివారం సాయంత్రానికి ముగియడంతో ప్రధాన పార్టీలు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి కేంద్రీకరించాయి. ఆయా పార్టీలు పోలింగ్ ఏజెంట్లను సిద్ధం చేసుకుంటున్నాయి. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు నాయకులు, కార్యకర్తలు అనేక పాట్లు పడుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్నికల్లో విలక్షణ తీర్పులు ఇవ్వడంలో ప్రత్యేక కలిగి ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్‌కు జిల్లా ప్రజాపరిషత్‌లో పట్టం కట్టి ఉద్యమానికి ఊపిరులూదింది. రైతు ఉద్యమాలలోనూ ప్రత్యేకతను చూపించింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల నాడి పట్టుకునేందుకు ప్రధాన పార్టీలు కుస్తీలు పడుతున్నాయి.

జహీరాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల్లో మోదీ చరిష్మా తమను విజయతీరాలకు చేరుస్తుందని బీజేపీ అభ్యర్థులు బీబీ పాటిల్, ధర్మపురి అర్వింద్ ధీమాగా ఉన్నారు. పసుపు బోర్డు అంశం మేలు చేయనుందని అర్వింద్ భావిస్తున్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలుతో తమకు గెలుపు ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థులు సురేశ్ షెట్కార్, తాటిపర్తి జీవన్‌రెడ్డి విశ్వాసంతో ఉన్నారు. నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేస్తున్న తమకు రైతులు, గల్ఫ్ కార్మికుల కుటుంబాలు అండగా ఉంటాయని వీరు భావిస్తున్నారు. ఇక రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ప్రాబల్యం నిలబెట్టుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఆ పార్టీ అభ్యర్థులు గాలి అనిల్ కుమార్, బాజిరెడ్డి గోవర్ధన్ బలమైన మున్నూరుకాపులు కావడంతో కలిసొస్తుందని నమ్ముతున్నారు.

■ గత శాసన సభ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఓటర్ల విలక్షణ తీర్పు స్పష్టమవుతుంది. జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని కామారెడ్డిలో బీజేపీ దేశంలోనే సంచలనం కలిగించే ఫలితాన్ని సాధించింది. ఇక్కడ కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను బీజేపీ అభ్యర్థి ఓడించారు. ఎల్లారెడ్డి, జుక్కల్, ఆందోల్, నారాయణ్‌ఖేడ్ స్థానాలను కాంగ్రెస్ గెలిచింది. బాన్సువాడ, జహీరాబాద్ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. అన్ని సెగ్మెంట్లలో కలిపి కాంగ్రెస్‌కు 5,49,143 ఓట్లు, బీఆర్ఎస్‌కు 5,30,499 ఓట్లు , బీజేపీకి 1,72,766 ఓట్లు వచ్చాయి. ఇక ఇక్కడ నుంచి సిట్టింగ్ ఎంపీ అయిన బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున గెలుపొందారు. మోదీ చరిష్మా తనను గెలిపిస్తుందని బీబీ పాటిల్ భావిస్తుండగా, రాష్ట్రంలో తమ పార్టీ అధికారం దక్కించుకున్నందున ఆ ప్రభావం తన గెలుపునకు దోహదం చేస్తుందని సురేశ్ షెట్కార్ ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్ సైతం గట్టిగా పోరు చేస్తున్నారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 16,35,042 ఓట్లు ఉన్నాయి.

■ నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ బోధన్, నిజామాబాద్ రూరల్ స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో గెలుపొందింది. అన్ని సెగ్మెంట్లలో కలిపి కాంగ్రెస్‌కు 4,08,135 ఓట్లు, బీజేపీకి 3,65,374 ఓట్లు, బీఆర్ఎస్‌కు 4,17,045 ఓట్లు వచ్చాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె కవితపై బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అనూహ్యంగా గెలుపొందారు. బీఆర్ఎస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే లేనప్పటికీ అర్వింద్ విజయం సాధించడం విశేషం. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 17,04,867 ఓట్లు ఉన్నాయి.

దేశంలో మార్పు రావాలి

- కామారెడ్డి కార్నర్ మీటింగ్‌లో ప్రియాంక గాంధీ
- కేడర్‌లో ఉత్సాహం నింపిన నేతలు
- పావుగంటలో ముగిసిన ప్రసంగాలు
- కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్!



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, అభ్యర్థి సురేశ్ షెట్కార్

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డిలో శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లు విజయవంతమయ్యాయి. ప్రసంగంలో 'మీ సోదరి నంటూ' ప్రియాంక గాంధీ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మీరు వేసే ఓటుతో దేశంలో మార్పు రావాలని ప్రజలను కోరారు. ప్రసంగం మధ్యలో మూడు రంగుల జెండా పట్టి అనే పాటపై వాహనం పైనే ప్రియాంక గాంధీ చప్పట్లు కొడుతూ హుషారు తెచ్చారు. సోనియా గాంధీకి తెలంగాణ ప్రజలతో ఉన్న అనుబంధం గురించి వివరించారు. ప్రజల కోరికను మన్నించి తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ నాలుగువేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని, రాహుల్ నాయకత్వాన్ని బలపరిచి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని పెట్టుబడిదారుల కూటమికి, రాహుల్ గాంధీ నాయకత్వంలోని ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ కూటమికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ధర్మం వైపు నిలవాలని కోరారు. రోడ్ షో విజయవంతంతో కాంగ్రెస్ శ్రేణుల్లోనూతనోత్సాహం కనిపించింది. ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా కామారెడ్డికి సాయంత్రం 5.27 గంటలకు చేరుకున్నారు. హెలీప్యాడ్ నుంచి కార్లలో ఇందిరా చౌక్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి ప్రారంభమైన రోడ్‌షో సిరిసిల్ల రోడ్, మాయా బజార్ మీదుగా జేపీఎన్ చౌరస్తా వరకు సాగింది. రోడ్‌షోలో వేలాది మంది పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ప్రియాంక గాంధీ మాట్లాడారు. టైం ఎంతయ్యిందని అడిగి మరీ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. పది నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు.

ఐదు నిమిషాల ముందే ముగింపు

ఎన్నికల ప్రచారానికి సాయంత్రం 6 గంటల వరకు సమయం ఉండగా.. కాంగ్రెస్ అగ్ర నేతలు ఐదు నిమిషాల ముందే మైకులు బంద్ చేసి ఎన్నికల నిబంధనలు పాటించారు. కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, నర్సింగరావు, ఇలియాస్, పండ్ల రాజు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

స్వేచ్ఛగా ఓటు వేయాలి

- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలు : సీపీ కల్మేశ్వర్



మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో ప్రతి ఓటరు పాలుపంచుకుని స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ కల్మేశ్వర్‌తో కలిసి పోలింగ్, కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, ఈసారి మరో గంటపాటు సమయం పొడిగించారని పేర్కొన్నారు. ఓటర్లకు 98.47 శాతం మేరకు ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేశామని చెప్పారు. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా నిఘా ముమ్మరం చేయించామని, నిఘా బృందాల సంఖ్య రెట్టింపు చేసి విస్తృత తనిఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

నిఘా నీడలో పోలింగ్

పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 1,808 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా, సీసీ కెమెరాల నిఘా నీడలో పోలింగ్ జరిపేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. 302 మంది సూక్ష్మ పరిశీలకులు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సేవలందిస్తారని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 17,04,867 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. 85ఏళ్లకు పైబడిన వారికి, దివ్యాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా వెసులుబాటు కల్పించిందని, 1772 మంది ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా, ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు వీలుగా 206 సెక్టార్లను ఏర్పాటు చేస్తూ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను నియమించామని పేర్కొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా పూర్తిచేసేలా..

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా పరిధిలో మూడు వేల పైచిలుకు మందితో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరిస్తామన్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది, ట్రెయినీ సిబ్బందితోపాటు ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, ఐదు కంపెనీల టీఎస్ఎస్పీ బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలును పక్కాగా పరిశీలించేందుకు 107 మొబైల్ పార్టీ బృందాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. పోలింగ్‌ను పురస్కరించుకుని ప్రతిఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని, శనివారం సాయంత్రం ఆరు గంటల అనంతరం ప్రచారం నిషేధమని స్పష్టంచేశారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెస్సేజ్, రికార్డెడ్ వాయిస్‌లు పంపడం నిషేధమని.. స్థానికేతరులు తమ ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది, ఓటర్లు మినహా ఇతరులెవరూ లోనికి వెళ్లకూడదన్నారు. సెల్‌ఫోన్లు లోనికి అనుమతించబోమని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

ప్రాంతానికి చిహ్నంగా..

- డొంకేశ్వర్ పోలింగ్ కేంద్రంలో ఎకో టూరిజం చిత్రాల ప్రదర్శన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ప్రదర్శించనున్న పోస్టర్ ఇదే..

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల్లో వినూత్న ప్రయోగం చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాల్లో ఆ ప్రాంతం ప్రాముఖ్యతను తెలియజేసేలా వాటి చిత్రాలను ప్రదర్శించాలని నిర్ణయించింది. అందులో భాగంగా డొంకేశ్వర్ జెడ్పీ పాఠశాలలోని 127 మోడల్ పోలింగ్ కేంద్రంలో ఎకో టూరిజం విశిష్టతను బ్యానర్ల ద్వారా ప్రదర్శించనున్నారు. అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. డొంకేశ్వర్‌తో పాటు చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి, గంగాసముందర్, నూత్‌పల్లి ప్రాంతాల్లో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో జింకలు, పక్షుల సందడి నెలకొంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, డొంకేశ్వర్ మండలం వన్య ప్రాణులకు నెలవుగా మారి టూరిస్టు ప్రాంతంగా ఏర్పడిన నేపథ్యంలో మోడల్ పోలింగ్ కేంద్రంలో వనప్రాణుల చిత్రాలను ప్రదర్శించనున్నారు. అలాగే మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో గల 128 బూత్‌ను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు కానుంది. ఇందులో పనిచేస్తే పోలింగ్ సిబ్బంది పూర్తిగా మహిళలే ఉంటారు. అలాగే మండలంలోని 19 కేంద్రాల్లో ఏర్పాట్లను తహసీల్దార్ వెంకటరమణ శనివారం పర్యవేక్షించారు.

ఈవీఎంల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



డిచ్‌పల్లి సీఎంసీ కళాశాల వద్ద ఈవీఎంల పంపిణీకి చేసిన ఏర్పాట్లు

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా డిచ్‌పల్లి మండలం సీఎంసీ కళాశాలలో నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను సీఎంసీలో ఏర్పాటు చేశారు. సీఎంసీ ఆవరణలో అర్బన్, రూరల్ నియోజకవర్గాల పోలింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం తర్వాత పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తీసుకుని నియోజకవర్గాల్లో తమకు కేటాయించిన బూత్‌లకు చేరుకుంటారు. పోలింగ్ సిబ్బందిని ఆయా గ్రామాలు, డివిజన్లకు చేర్చేందుకు ఎన్నికల అధికారులు వాహనాలను అందుబాటులో ఉంచారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీబందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన అనంతరం నిజామాబాద్ పార్లమెంట్‌కు సంబంధించిన మొత్తం ఈవీఎంలు, వీవీ ప్యాట్లను తిరిగి సీఎంసీకి తీసుకువచ్చి స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

సానుభూతి కోసం జీవన్‌రెడ్డి పాకులాట

- దేశ భద్రత, భవిష్యత్‌పై వైఖరి చెప్పి ఓట్లడగాలి
- యూనిఫాం సివిల్ కోడ్ అమలు అంబేడ్కర్ ఆశయం
- బీజేపీ గ్యారంటీగా గెలిచే సీట్లలో నిజామాబాద్ ఉంది
- మీట్ ది ప్రెస్‌లో బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్


మాట్లాడుతున్న అర్వింద్

సుభాష్‌నగర్: తనకు ఇవే చివరి ఎన్నికలంటూ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సానుభూతికోసం పాకులాడుతున్నారని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు దేశ భద్రత, భవిష్యత్‌పై తమ, తమ పార్టీ వైఖరి చెప్పిన తర్వాతే ఓట్లు అడగాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కమిటీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, వాల్యుయేషన్ వేయించి ధర బహిర్గతం చేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్‌కు గల్ఫ్‌బోర్డు, రుణమాఫీపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. 1989 ఎన్నికల నుంచే బీజేపీ మేనిఫెస్టోలో అయోధ్య రామజన్మభూమి అంశాన్ని పేర్కొంటోందని, న్యాయపరంగానే ఆలయ నిర్మాణం అయ్యిందన్నారు. పోలింగ్ రోజున మహిళలు స్కార్ఫ్, బుర్ఖాలు తొలగించి ఓటింగ్‌లో పాల్గొనాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశానని గుర్తుచేశారు. దేశంలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయాలనేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమని అర్వింద్ పేర్కొన్నారు. బీజేపీ గెలిస్తే సీఏఏ, ఎన్ఆర్‌సీ, యూనిఫాం సివిల్ కోడ్, ఒకే దేశం ఒకే ఎన్నికలు, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, దేశ సంస్కృతీ, వారసత్వ సంపద కాపాడుతుందన్నారు. బీజేపీ మత ప్రాతిపదికన పథకాలు ప్రవేశపెట్టడం లేదని, తమ పార్టీకి మైనార్టీ, మెజార్టీ అనే తేడా లేదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీజేపీలో పోటీతత్వం పెరిగిందని, తనపై ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ లేదని, భవిష్యత్‌లో ఉండబోదని తేల్చిచెప్పారు. టికెట్ ఆశించి రాకపోవడంతో ఆరోపణలు చేయడం సహజమని మీసాల శ్రీనివాస్‌రావును ద్దేశించి వ్యాఖ్యానించారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయం ఇందూరులోనే నెలకొల్పుతామని అన్నారు. తమ పార్టీ గ్యారంటీగా గెలుపొందే సీట్లలో నిజామాబాద్ ఉందన్నారు.

అభివృద్ధిని ఎంపీ పట్టించుకోలేదు

- వ్యక్తిగత విషయాలకే అర్వింద్ పరిమితమయ్యారు
- సెప్టెంబర్ 17న చక్కెర పరిశ్రమలను పునః ప్రారంభిస్తాం
- 2025 డిసెంబర్‌లో క్రషింగ్..
- ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రజాసమస్యలపై ప్రశ్నించా
- మీట్ ది ప్రెస్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఐదేళ్లలో పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిని ఎంపీ అర్వింద్ పట్టించుకోలేదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పనులకే పరిమితమైన అర్వింద్.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు బూటకపు హామీలిస్తున్నారని, సమస్యలపై అర్వింద్‌కు అవగాహన, చిత్తశుద్ధి లేదన్నారు. అర్వింద్.. కవితను ఆదర్శంగా తీసుకొని పనిచేశారని, ఎవరికీ అందుబాటులో లేరని, ప్రజాసమస్యలు గాలికొదిలేశారని అన్నారు. స్మార్ట్‌సిటీ జాబితాలో నిజామాబాద్ లేకపోవడానికి అర్వింద్ నిర్లక్ష్యమే కారణమన్నారు. సహకార రంగంలో చక్కెర పరిశ్రమలను తెరిపిస్తామని అమిత్‌షా చెప్పడం సరైనది కాదన్నారు. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించే అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుదద్ధితో ఉందన్నారు. నిజాంషుగర్స్‌ను సెప్టెంబర్ 17న పునఃప్రారంభిస్తామని, 2025 డిసెంబర్లో క్రషింగ్ ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటుదన్నారు. ఎమ్మెల్సీగా ప్రజాసమస్యలను శాసనమండలిలో ప్రస్తావించానని, తెలంగాణ ప్రజల ప్రశ్నించే గొంతుకగా కొట్లాడినట్లు చెప్పారు. కాంగ్రెస్ గెలిస్తే స్మార్ట్ సిటీ జాబితాలో నిజామాబాద్‌ను చేర్పించి అభివృద్ధి చేయిస్తానని, మహిళా డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆర్మూర్ – ఆదిలాబాద్, బోధన్ – బీదర్ రైల్వే లైన్ కోసం కృషి చేస్తానన్నారు. కొందరు పని గట్టుకొని తనను నాన్‌లోకల్ అని ప్రచారం చేస్తున్నారని, నిజామాబాద్ పార్లమెంట్‌లోనే జగిత్యాల ఉందన్నారు. అర్వింద్ కోరుట్లలో ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేశారని ప్రశ్నించారు.

రెచ్చగొడుతూ కాలయాపన చేశారు

- కాంగ్రెస్ హామీలను మరిచిపోయింది
- ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపుతా
- అనుభవంతో పోరాడి నిధులు తెస్తా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్‌నాగారం: ఎంపీ అర్వింద్ రెచ్చగొడుతూ మత రాజకీయాలతో కాలయాపన చేశారని, మరోవైపు కాంగ్రెస్ తానిచ్చిన హామీలను మర్చిపోయిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పసుపు బోర్డు ఇవ్వలేక.. ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ గురించి అర్వింద్ మాట్లాడడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారన్నారు. డుప్లికేట్ సెక్యులర్ పార్టీ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డి అని, ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అర్వింద్‌ను గెలిపించానని ఆయనే స్వయంగా చెప్పారన్నారు. సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి కలిసి అర్వింద్‌కు సపోర్ట్ చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు జనాన్ని మోసం చేస్తున్నాయన్నారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపుతానని బాజిరెడ్డి అన్నారు. అనుభవంతో పోరాడి నిధులు తీసుకువస్తానన్నారు. నిజామాబాద్ – ఆదిలాబాద్, బోధన్ – బీదర్ రైల్వేలైన్‌కు కృషి చేస్తానన్నారు. సికింద్రాబాద్ నుంచి డబ్లింగ్ లైన్ చేసేందుకు కృషి చేస్తానన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఏ గ్రామం గురించైనా అర్వింద్ ఒక్కసారైనా పార్లమెంట్‌లో మాట్లాడారా? నిధులు తీసుకువచ్చారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకానివారు ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. అర్వింద్ సీనియర్లను తొక్కాడని, ఆయన రాముని పాత్రలో ఉన్న రావణుడని విమర్శించారు. అర్వింద్ మళ్లీ గెలిస్తే ప్రమాదమన్నారు. కాంగ్రెస్ మోసపు మాటల కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఓడిపోయామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ జిల్లా ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్‌ఠాకూర్, రవిచందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపొచ్చు



సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటర్లు 13 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఓ కార్డు చూపించి ఓటు వేయొచ్చని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఓటరు గుర్తింపు, ఆధార్, ఉపాధిహామీ, ఫొటోతో ఉన్న పోస్టాఫీస్/బ్యాంక్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సురెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వివరించారు. ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు

ఇందల్వాయి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డిపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు లింగాపూర్ పెద్ద సంతోష్‌రెడ్డి దాడికి యత్నించడంతో ఆ పార్టీలోని అంతర్గత కలహాలు బయటపడ్డాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం తిర్మన్‌పల్లి చౌరస్తాలో సాయిరెడ్డి కారుని సంతోష్‌రెడ్డి అడ్డగించాడు. కారులో నుంచి సాయిరెడ్డి దిగగా, అతని చొక్కా పట్టుకొని చించి.. దాడికి యత్నించడంతో అక్కడే ఉన్న నాయకులు అడ్డుకున్నారు. మండల కాంగ్రెస్‌లో తనకు సముచిత స్థానం దక్కడం లేదని, కొత్తగా పార్టీలో చేరిన వారికి పెద్దపీట వేస్తున్నారనే అక్కసుతో సంతోష్‌రెడ్డి సహనం కోల్పోయాడని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. విషయం ఎమ్మెల్యే వద్దకు వెళ్లిందని, ఎన్నికల తర్వాత క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిసింది.

లారీల కొరతతో రైతులకు గోస

ఎల్లారెడ్డి: మండలంలో లారీల కొరతతో కాంటా చేసిన ధాన్యం బస్తాలను తరలించడంలో జాప్యం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కాంటా చేసి రెండు రోజులైన తరలించకపోవడంతో వర్షాలకు బస్తాలు తడిసిపోతున్నాయ ని వాపోతున్నారు. అదేవిధంగా లారీ డ్రైవర్లు రైతుల వద్ద బస్తాకు రూ.4 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వకపోతే బస్తాలను తరలించడం లేదన్నారు. అధికారులు స్పందించి లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద ట్రాఫిక్ మళ్లింపు


కల్మేశ్వర్, సీపీ

ఖలీల్‌వాడి: ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ బూత్‌ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. పోలింగ్‌బూత్‌లకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్‌బూత్‌ల వద్ద ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని వివరించారు.

నిజామాబాద్ నగరంలో..

ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలపల్లి మెయిన్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్ పోలింగ్ బూత్‌నకు ఎడమ, కుడి బై లైన్‌ల ద్వారా వాహనాల రాకపోకల సాగించాల్సి ఉంటుంది. అలాగే రెండోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్డెన్ జూబ్లీ స్కూల్, మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్ఐ కాలేజీ, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, జీజీ కాలేజీ పరిసర ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నందున వాహనాదారులు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కాలేజీ, పులాంగ్ చౌరస్తా ప్రభుత్వ పాఠశాల పోలింగ్‌బూత్ ప్రాంతాల్లో సైతం ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలి. అలాగే, ఐదోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్, ముజాహిద్‌నగర్, క్రిసెంట్ పబ్లిక్ స్కూల్, ఖిల్లా రోడ్డు పరిసర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద వాహనాల దారి మళ్లింపు ఉంటుంది. ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో నగర్ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్, అర్సపల్లిలోని ఇందూర్ ఐటీఐ, అర్సపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నందున వాహనాదారులు వేరే మార్గాల ద్వారా ప్రయాణించాలి.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్ పట్టణంలోని ఫతేపూర్ ఎక్స్ రోడ్డు, ఖాశీ హనుమాన్ ఎక్స్ రోడ్డు, అశోక్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి దోబీఘాట్ వరకు, జిరాయత్‌నగర్ ఎక్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నందున వాహనాదారులు వేరే మార్గాల మీదుగా ప్రయాణించాలి.

బోధన్ పట్టణంలో..

ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రెంజల్ బేస్‌లోని నిజామియా స్కూల్, రాకాసీపేట్, మధుమలాంఛ స్కూల్ పోలింగ్ బూత్ ప్రాంతాల మీదుగా కాకుండా ఇతర మార్గాల్లో వాహనదారులు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

జీవన్‌రెడ్డి మాల్‌కు 20కి పైగా నోటీసులు

- ఆర్టీసీ ఉన్నతాధికారులపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారు
- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌కు ఐదేళ్లలో 20కిపైగా నోటీసులు ఇచ్చామని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జీవన్‌రెడ్డిమాల్ యాజమాన్యం ఆర్టీసీకి లీజుకు సంబంధించి రూ.2.51 కోట్లు బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు. టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేశారని, ఆయన ఆరోపణలను ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోందని, ఆయన విజ్ఞతకే వదిలేస్తోందని పేర్కొన్నారు. అద్దె బకాయిల వసూలు విషయంలో లీజు ఒప్పందం, హైకోర్టు ఆదేశాల ప్రకారమే సంస్థ నడుచుకుంటోందని స్పష్టం చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 9న నోటీసులు ఇవ్వడానికి ఆర్టీసీ అధికారులు షాపింగ్ మాల్‌కు వెళ్లారని, మాల్‌లో థర్డ్ పార్టీ స్టాళ్లు ఉండటంతో వారికి సమాచారం ఇచ్చేందుకు మైక్‌లో అనౌనన్స్ చేశామని తెలిపారు. తమకు ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించడంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు.

కేంద్రానికి జీఎస్టీ చెల్లించడం లేదనడం పూర్తి అర్థరహితమని, నిబంధనల ప్రకారమే క్రమం తప్పకుండా జీఎస్టీని కేంద్రానికి సంస్థ చెల్లిస్తోందని పేర్కొన్నారు. బకాయిల వసూలు విషయంలో సంస్థ ఏమాత్రం రాజీ పడటం లేదని, నిబంధనల మేరకే వసూలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా సంస్థపై, ఉన్నతాధికారులపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం సరికాదని హితవుపలికారు.

యువత కీలకపాత్ర పోషించాలి

నిజామాబాద్ నాగారం: లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా యువత కీలకపాత్ర పోషించాలని జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును ముందుగానే వినియోగించుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరినీ చైతన్యం చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో వలంటీర్లుగా పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

పైడిమల్‌లో భారీ వర్షం

వర్ని: మండలంలోని పైడిమల్, గుంటూరు క్యాంప్, సిద్ధాపూర్, కోకల్‌దాస్ తండా శివార్లలో శనివారం సాయంత్రం మూడు గంటలకు భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు ఏర్పడింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ఎండతీవ్రత కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు.

గాంధారిలో..



గాంధారి: అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో కల్లాల వద్ద ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో శనివారం పూర్తిచేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జగిత్యాల కలెక్టర్ యాస్మీన్ బాషా కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోగల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అబ్జర్వర్ దృష్టికి తెచ్చారు. 20 శాతం రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, దివ్యాంగుల బృందం, యువతతో కూడిన పోలింగ్ బృందాలను, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశామని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తిచేశారు. అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, ఏఓ ప్రశాంత్ పాల్గొన్నారు.


ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న సాధారణ పరిశీలకులు, కలెక్టర్..

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్

ఆర్మూర్‌టౌన్: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 5గంటల నుంచి సోమవారం వరకు వైన్స్ షాపులు మూసి ఉంటాయని అన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

మద్యం పట్టివేత

వర్ని (మోస్రా): ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఇంట్లో నిలువ ఉంచిన మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన సదరు నాయకుడి ఇంట్లో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించగా 20 లీటర్ల మద్యం పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ పవన్‌గౌడ్ తెలిపారు. అనుమతులు లేకుండా మద్యాన్ని నిల్వ చేసినా, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం పంపిణీ చేసినా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

డీఎంహెచ్‌వో తీరుపై సీరియస్

- లైంగిక వేధింపుల ఘటనపై ఆరా తీసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి
- ఈ నెల 16 వరకు సెలవు పెట్టిన జిల్లా వైద్యాధికారి
- చట్టపరమైన చర్యలకు రంగం సిద్ధం!

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిపై మెడికల్ ఆఫీసర్‌లు చేసిన ఫిర్యాదు ఘటనలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సీరియస్ అయినట్లు తెలిసింది. తమను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు రాష్ట్ర అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను జిల్లా అధికారులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైద్యులు చేసిన ఫిర్యాదు, సాక్షి దినపత్రిక మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర అధికారులు స్పందించి ఆరా తీశారు. జిల్లా అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. జిల్లా అధికారులతో పాటు డీఎంహెచ్‌వో తీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది. అయితే ఫిర్యాదు చేసిన మరుసటి రోజు నుంచి ఈనెల 16వ తేదీ వరకు డీఎంహెచ్‌వో సెలవు పెట్టి వెళ్లిపోయారు. 16 తర్వాత లాంగ్ లీవ్‌లో వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఎన్నికల అనంతరం డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పూర్తి విచారణ జరిపి డీఎంహెచ్‌వోను సస్పెండ్ చేయాలని అధికారులకు రాష్ట్ర కార్యదర్శి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కార్యాలయ సూపరింటెంటెండ్ ఓ మహిళా మెడికల్ ఆఫీసర్‌తో అసభ్యకరంగా మాట్లాడటం, ఫోన్‌లో చాటింగ్ చేయడం ఘటనపై విచారణ చేపట్టాలని ఆదేశించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


ఆకుల రమేశ్ (ఫైల్)

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలంలోని కోటాల్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ గత నెల 28వ తేదీన మలేషియాలో గుండెపోటుతో మృతి చెందగా.. మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోటాల్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ బతుకు దెరువు కోసం మలేషియాకు వెళ్లాడు. అక్కడ పని నచ్చకపోవడంతో కుటుంబీకులు రిటర్న్ టికెట్ బుక్ చేయగా, గత నెల 28వ తేదీన తిరిగి వస్తుండగా ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు చిట్టడి సుధాకర్‌రెడ్డి ఎయిర్‌పోర్టు అధికారులతో మాట్లాడి మృతదేహన్ని తన సొంత ఖర్చులతో స్వదేశానికి 14 రోజుల్లో తెప్పించారని స్థానికులు తెలిపారు. రమేశ్ మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

రైల్వేగేటు గదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: అక్కన్నపేట్ – మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య కొంత కాలంగా మూసి ఉంచిన రైల్వే గేటు గదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్సై తావూనాయక్, సిబ్బంది ఘటనాస్థలాన్ని శనివారం పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. సహజమరణంగా భావిస్తున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మత్తమాల గ్రామ శివారులోని నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేశ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, మృతదేహంపై బ్లూకలర్ షర్ట్, చెక్స్ లుంగీ ఉన్నాయని ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లేగదూడ..

కామారెడ్డి రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ లేగ దూడ మృతికి కారణమైన ఘటన కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముల్క వీరేశం తన లేగదూడను రోజూలాగే తన వ్యవసాయ పొలంలో వదిలాడు. అయితే, గత కొద్ది రోజుల క్రితం భారీ గాలుల కారణంగా పడిపోయిన విద్యుత్ స్తంభాలను కొన్నింటిని సరి చేయగా, మరికొన్నింటిని సరి చేయకుండానే విద్యుత్ సరఫరా చేయడంతో 11 కేవీ వైర్లు తగిలి లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. మరమ్మతులు పూర్తయిన తరువాతే విద్యుత్ సరఫరా చేసి ఉంటే ప్రమాదం తప్పదేని రైతులు అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం అధికారులు సకాలంలో కరెంట్ తీగలకు మరమ్మతులు పూర్తి చేసిన తర్వాతే విద్యుత్ సరఫరా చేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని రైతులు పేర్కొన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే లేగదూడ మృతి చెందిందని బాధితులు అన్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కమ్మరి సంధ్య ఈనెల 10వ తేదీన ఇంట్లో గొడవపడి తన ఏడాది వయస్సు గల కుమారుడు చైతన్యతో కలిసి బయటికి వెళ్లిపోయింది. సంధ్య ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డికి చెందిన వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన భోజ పోశయ్య(65)అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. కాలికి చికిత్స చేయించుకునేందుకు ఆస్పత్రికి వెళ్తున్నానని ఈనెల 10వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పోశయ్య బావమరిది నర్సింలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతంగల్ చెక్ పోస్టు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్నూర్ మండలానికి చెందిన యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్నూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన పింగ్లె భీమ్‌రావు (30) మందర్గా గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన భీమ్‌రావును బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకోగానే భీమ్‌రావు మృతి చెందాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నీటిలో మునిగి ఒకరు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లి చెరువులో మునిగి యువకుడు మృతి చెందినట్లు స్థానికులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మంత్రి లక్ష్మణ్ (22) తనకు గేదెలు రెండు రోజులుగా రాకపోవడంతో వాటిని గాలిస్తున్నాడు. ఈ క్రమంలో చెరువులో గేదెలు ఉన్నట్లు గుర్తించిన లక్ష్మణ్.. వాటిని బయటకు కొట్టేక్రమంలో నీటిలో మునిగి మృతి చెందాడు.

పరిస్థితి విషమించి ..

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లికి చెందిన తిరుపతి మాక్లూర్ మండలం చిక్లిలోని అత్తగారి ఇంటికి వచ్చి.. బైక్‌పై తిరిగి బిద్రెల్లికి తిరిగి వెళ్తుండగా జన్నేపల్లి వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్తూ..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. నాగిరెడ్డిపేట మండలంలోని రామక్కపల్లి గ్రామ శివారులో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామానికి చెందిన ఎరుకల దుర్గయ్య (45) ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో రామక్కపల్లి శివారులో ప్రమాదవశాత్తు బైక్ చెట్టును ఢీకొనడంతో దుర్గయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.